క్లుప్తంగా

ఈ-కేవైసీ చేయించుకోండి

నవాబుపేట: రైతులు బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ లేని వారు వెంటనే చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిశోర్ తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన ఏఈఓలకు ఆదేశాలు అందించి రైతులకు వివరించాలని సూచించారు. ఈ నెల 30లోపు రైతులు తాము పొందిన బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీని అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు రైతుల ఖాతాలో జమ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని తెలిపారు.

అనాథలను ప్రభుత్వం ఆదుకోవాలి



జడ్చర్ల టౌన్: అనాథలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ వెంటనే నిలబెట్టుకోవాలని, మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను అమలు చేయాలని ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద హరిగోస దీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బీసీ, ఎస్టీల మాదిరిగానే అనాథలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు వర్తింపజేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సురేష్, యాదయ్య, జంగయ్య, కృష్ణ, యాదయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండాకు చెందిన బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లష్కర్‌నాయక్ ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటుండగా శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులును పరామర్శించారు. అడ్డాకులకు చెందిన గులాం మహ్మద్ మృతి చెందడంతో ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

సంకల్పసభ జయప్రదం చేద్దాం



జడ్చర్ల టౌన్: నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే బీజేపీ సంకల్పసభను జయప్రదం చేద్దామని ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కార్యాలయంలో శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఆదివారం నిర్వహించే సభకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నారని, ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, కౌన్సిలర్ కుమ్మరి రాజు, సాహితి, ఆంజనేయులు, వెంకట్, అనంతకిషన్, జ్యోతి, నవీన్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మాచన్‌పల్లి, రామచంద్రాపూర్‌లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములలో స్థలాలు ఇచ్చి, గృహలక్ష్మి పథకం కింద రూ. 5 లక్షలకు పెంచి ఇవ్వాలని అన్నారు. నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న మహబూబ్‌నగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హన్మంతు, ఖాదర్, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లిలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుర్వ లక్ష్మమ్మ కుటుంబాన్ని శుక్రవారం జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. లక్ష్మమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ రూ.5వేలు, సర్పంచ్ రూ.10వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రభుత్వం తరుపున బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.




మారిన పాఠశాలల రూపురేఖలు

- మన ఊరు– మన బడి పథకంలో మౌలిక వసతులు
- కొత్తదనాన్ని తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు



డిజిటల్ క్లాసులు నేర్చుకుంటున్న విద్యార్థులు



తరగతి గదుల్లో డ్యుయల్ డెస్క్ బెంచీలు



పెయింటింగ్స్‌తో కల్లేపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

రాజాపూర్: విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఇందుకు మన ఊరు – మన బడి పథకంతో పాఠశాలల మరమ్మతు చేపట్టి కొత్తవాటిలా మార్చేశారు. గతంలో ఉన్న పాఠశాలలకు ప్యాచ్‌వర్క్‌తో పాటు పెయింటింగ్స్, టాయిలెట్స్ పనులు చేయించారు. విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు డ్యుయల్ డెస్క్ బెంచ్, గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేశారు. మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో 9 ప్రాథమిక పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను మన ఊరు – మన బడి పథకంతో రూ.కోటికి పైగా నిధులను వెచ్చించి పనులు పూర్తి చేశారు. దీంతో ఈ సంవత్సరం గ్రామాల్లో, గిరిజనతండాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సైతం విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు ఉన్న తేడాపై అవగాహన కల్పించడంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు.

కొత్తగా తయారు చేశారు



గతేడాది పాఠశాలకు, ఇప్పటికి ఎంతో తేడా వచ్చింది. పాఠశాలలో ఉన్న సమస్యలను తీర్చి కొత్తదనాన్ని తెచ్చారు. క్లాస్ రూంలలో డ్యుయల్ డెస్క్ బెంచీలు చాలా బాగున్నాయి. గతంలో నీటి సమస్య ఉండే ట్యాంకు ఏర్పాటు చేసి నల్లాలు బిగించారు. టాయిలెట్స్ కూడా నిర్మించారు. మాకు ఇంగ్లిష్ మీడియంతో పాటు డిజిటల్ క్లాసులు నేర్చుకుంటున్నాం.

– అశ్విని, 7వ తరగతి, కల్లేపల్లి

మెరుగైన విద్య అందిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌గా దీటుగా విద్యాబోధన చేస్తున్నాం. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఉన్నాయి. ప్రభుత్వం ఉచిత పుస్తకాలు, దుస్తులతో పాటు రుచికరమైన భోజనం అందిస్తుంది. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నారు. సొంత ఖర్చులతో డిజిటల్ బోధన చేస్తున్నాం. మంచి ఉత్తీర్ణత ఫలితాలు తీసుకువచ్చేందుకే కృషి చేస్తున్నాం.

– విష్ణువర్ధన్‌గౌడ్, హెచ్‌ఎం, రాజాపూర్

జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు

బాలానగర్: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంతకు వేలాదిగా వచ్చే ప్రజలతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి దాటే సమయంలో పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో మండల కేంద్రానికి ఇతర గ్రామాల నుంచి వచ్చి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. నిమిషం వ్యవధిలో పదుల సంఖ్యలో వాహనాల రాకపోకలు చేస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. జాతీయరహదారిపై వాహనాలను నియంత్రించడానికి కనీసం ఒక్క కానిస్టేబుల్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం మండల కేంద్రంలోని సంత బజారులో రోడ్డులో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. అయినా కొందరు వాహనదారులు జేసీబీలు, లారీలను సంతబజారులో నుంచే రాకపోకలు సాగించడంతో సంతకు వచ్చే చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంఘటనపై స్పందించే అధికారులు లేరని , వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, మండల ప్రజలు కోరుతున్నారు.



బాలానగర్‌లో వాహనాల మధ్య రోడ్డు దాటుతున్న విద్యార్థులు

ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు

జడ్చర్ల టౌన్: పట్టణ శివారులోని ఏరియా ఆస్పత్రిలో 10పడకలతో నిర్వహిస్తున్న ఉచిత డయాలసిస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సోమశేఖర్ పిలుపునిచ్చారు. పది రోజులుగా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయని వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇప్పటి వరకు పొందుతున్న చికిత్స వివరాల జిరాక్స్ ప్రతులు, ఆధార్‌కార్డు తీసుకుని వస్తే చాలని తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న జనరల్ డాక్టర్ రెఫర్ చేస్తారని, డయాలసిస్ సెంటర్‌లో ఉన్న టెక్నీషియన్స్ వివరాలు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఉచితంగానే డయాలసిస్ సేవలు లభిస్తాయన్నారు. సెంటర్‌లో ప్రతిసారి డయలైజర్ కొత్తది వినియోగించటం వల్ల ఎలాంటి ఇన్‌ఫెక్షన్లు దరిచేరకుండా ఉంటాయన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని కోరారు. పరిసర గ్రామాలు, మండలాల వారు సైతం సేవలను వినియోగించుకోవాలన్నారు.



ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

వైభవంగా బొడ్రాయి ఉత్సవాలు



ప్రతిష్ఠించనున్న విగ్రహాలు



బొడ్రాయి ఊరేగింపు

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ ప్రజలను కంటికి రెప్పలా కాపాడే బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన మహోత్సవానికి మండలంలోని కోటకదిర గ్రామం ముస్తాబైంది. కోట మైసమ్మ, ఎల్లమ్మ దేవతల విగ్రహాలతో పాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను సర్పంచ్ మల్లు రమ్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. అయితే ప్రతిష్ఠాపనకు ముందు నిర్వహించాల్సిన క్రతువు, హోమం తదితర పూజా కార్యక్రమాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం గ్రామంలోని పీర్ల మసీద్ సమీపంలో ఉన్న బొడ్రాయి స్థానంలో కొత్తగా పునః ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 22 నుంచి 24 వరకు బొడ్రాయి పండుగ, పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం బొడ్రాయితో పురవీధుల్లో భారీ ఊరేగింపు చేపట్టారు. శనివారం ఉదయం 10:19 గంటలకు బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూర్తవుతుందని గ్రామస్తులు తెలిపారు.

ఎన్సీఆర్టీఈ అధికారులపై చర్యలు తీసుకోండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదో తరగతి సాంఘికశాస్త్ర పుస్తకంలో రాజ్యాంగ పీఠికలో సెక్యూలర్ పదాన్ని తొలగించినందుకు ఎన్సీఆర్టీఈ అధికారులపై చర్యలు తీసుకోవాలి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇటువంటి నిర్ణయాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని దూమర్ల నిరంజన్, రమాకంత్ అశోక్ తదితరులు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దగాపడ్డ తెలంగాణలో మార్పు కోసం మహా ఉద్యమం పేరుతో ఏబీవీపీ నాయకులు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం పీయూ ముఖద్వారం వద్ద విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ ఫీజు రియింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ప్రవీణ్, శరత్, కృష్ణ, శివప్రసాద్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

జడ్చర్ల టౌన్: శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో భాగంగా అసెంబ్లీ కన్వీనర్ నర్సింహులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ భారతీయ జన సంఘం ప్రారంభించి దేశంలోనే తొలి హిందూవాద రాజకీయ పార్టీ స్థాపించిన మహనీయుడుగా కొనియాడారు. కార్యక్రమంలో నాగరాజు, కుమ్మరిరాజు, వెంకట్, సాహితిరెడ్డి, అనంతకిషన్, కిట్టు, శ్రీనాథ్, ప్రశాంత్, ధీరజ్, సందీప్, మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మహమ్మదాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నాసిరకమై భోజనం పెడుతున్నారని ఫిర్యాదులు అందడంతో శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనం నాసిరకంగా ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే ఎలా అని నిలదీశారు. పండ్లు, గుడ్లు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. దీంతో వెంటనే గుడ్లు తెచ్చి విద్యార్థులకు అందించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు. ఎంత వండారు, ఏమేమి వండారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన నిర్వాహకులను ఆదేశించారు.

ప్రత్యేక రాష్ట్రంలోనే పంచాయతీల అభివృద్ధి

కోయిల్‌కొండ: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాతనే పంచాయతీలు అభివృద్ధి చెందాయని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దమాయపల్లి, గార్లపహాడ్, అభంగపట్నం, గంగ్యానాయక్‌తండా, లింగుపల్లి, బూర్గుపల్లి, సూరారం, చిన్నలింగల్‌చేడ్, హనుమాన్‌గడ్డతండా, సంగనోనిపల్లి, వింజామూర్‌లో క్రీడా మైదానాలు, పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు కరుణాకర్‌రెడ్డి, మాధవి, నారాయణరెడ్డి, ఎంపీటీసీ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



దమాయపల్లిలో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి



మహమ్మదాబాద్: గ్రామాల్లో ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని డీఎం పవిత్ర, దేశాయిపల్లి సర్పంచ్ రఘునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం దేశాయిపల్లి బస్టాండ్‌లో బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ పలు సేవలు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా బస్‌పాస్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వాసవీమాతకు గోరింటాకుతో అలంకరణ



పూజల్లో పాల్గొన్న వనితా క్లబ్ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆషాఢమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వనితాక్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారికి గోరింటాకుతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవేంద్రశర్మ గోరింటాకు ప్రాచుర్యం గురించి వివరించారు. గోరింటాకు అసలుపేరు గౌరి ఇంటి ఆకు అని తెలిపారు. అనంతరం గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, రాధిక, లావణ్య పాల్గొన్నారు.

దేవాలయాల పునర్నిర్మాణ పనులు



దేవరకద్ర: మండల కేంద్రంలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న శివాలయం, వీరప్పయ్య స్వామి దేవాలయంల పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వందల ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయాల గోపురాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టారు. ఆలయ రాజగోపురాలు, చుట్టు ప్రకారాలు అందంగా తీర్చిదిద్దుతున్నారు. కళానైపుణ్యంతో విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. ఆలయాల నిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చి విరివిగా విరాళాలు అందజేశారు. రూ.కోటికి పైగా దేవాలయాల పునర్నిర్మాణ కోసం వెచ్చిస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

రాజాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరమని ముడా డైరెక్టర్ శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లేపల్లి చెందిన బచ్చిరెడ్డితండా పాండుకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును ఆయన అందజేశారు. సీఎం కేసీఆర్ ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో శేఖర్‌యాదవ్, రాజేందర్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రేమజంటను కలిపిన పోలీసులు

నవాబుపేట: మండలంలోని చౌడూర్ చెందిన యాదమ్మకు భూత్పూర్ మండలం మదిగట్ల చెందిన పెంటయ్య మూడేళ్ల క్రితం నంబర్ తప్పుగా కొట్టి రాంగ్ కాల్ చేశాడు. ఇద్దరు తరుచూ మాట్లాడుకోవటం కొనసాగి చివరికి ప్రేమ వరకు చేరింది. తాజాగా యాదమ్మ నాలుగు నెలల గర్భవతి కావటంతో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో అతడు దాట వేస్తూ రావటంతో బాధితురాలు శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. దీంతో వారి ఇద్దరికి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ఎస్ఐ పురుషోత్తం కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లికి ఒప్పించారు. చౌడూర్, మదిగట్ల గ్రామపెద్దలతో కలిసి మండల కేంద్రంలోని శివాలయంలో పెళ్లి చేయించారు. అనంతరం ఇరు కుటుంబాలు ఎలాంటి గొడవలు పడకుండా ఉండాలని అమ్మాయిని వేధించడం, అబ్బాయిని బెదిరించటం చేయరాదన్నారు.



దండలు మార్చుకుంటున్న ప్రేమ జంట దేవాలయంలో పెళ్లి..

ఘనంగా బోనాల పండుగ



గండీడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో పోచమ్మ దేవాలయంలో ఉన్న అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు సామూహికంగా బోనాలతో ఊరేగి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కులు సమర్పించుకున్నారు. వర్షం కారణంగా ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కేంద్ర నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి

కోయిల్‌కొండ: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గార్లపహాడ్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, యాదిరెడ్డి, పేటరాజు, గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ బీటీ రోడ్డు నుంచి నాగన్నపల్లి వరకు మంజూరైన మట్టి రోడ్డు పనులను శుక్రవారం ఎంపీపీ రమాదేవి ప్రారంభించారు. కోయిల్‌సాగర్ ఎడమ కాల్వ పక్కన ఉన్న రోడ్డు ఇరుకుగా ముళ్ల చెట్లతో ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కొత్త రోడ్డు పనులు చేపట్టినట్లు ఎంపీపీ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్ చెందిన కొండన్న(62) అదృశ్యమైనట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లే కొండన్నకు మళ్లీ ఇంటికి తిరిగొచ్చే అలవాటుందని చెప్పారు. ఇదేవిధంగా కొన్నాళ్ల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లడంతో బంధువులు అంతటా వెతికారని పేర్కొన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య సుగుణమ్మ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.